
# ఆత్మహత్యల రుతువు





మాలతి మబ్బులు కమ్మిన మధ్యాహ్నపు వెలుతురులో నిలబడి, పలచబడుతున్న ఎండను, నిశ్శబ్దంగా, మౌనంగా ఘనీభవించిన పద్యాల్లా నిలబడ్డ యూనివర్శిటీ బిల్డింగులను, బిల్డింగ్‌ల చుట్టూ ఉగ్రంగా మొలుచుకొచ్చిన ఎర్రని బోగన్‌విల్లియా పొదలను, రాతిగోడలపై నిలబడి భయంగా పాకుతున్న నీలపురంగు పూలతలను చూస్తూ ఇదంతా కొత్తగా శరీరంలోకి ఇప్పుడే ప్రవేశపెట్టబడ్డ దృశ్యంలా అనిపించి మరో కొత్త దుఃఖపు కథ మొదలు కాబోతుంది అనుకొని, గాఢంగా నిట్టూర్చింది.

ప్రొఫెసరు వై.వి. (యదువంశి) ఉదయాన్నే ఫోన్ చేసి “పి.సి. రామ్ అని గొప్ప నాటక ప్రయోక్త, ఆయన పోయాడు. సంతాపయాత్ర, అదే శవాన్ని తీసుకువెళ్ళటం – తెలుగులో సరైన మాట లేదు. ఇంగ్లీషులో ‘రెక్వియమ్’ అంటారు. దానికి మనం అటెండ్ కావాలి. కాంపస్‌లోనే ఉండు. పదింటికి నిన్ను పికప్ చేసుకొంటాను” అని కాసేపు ఆగి, “మనం తప్పనిసరిగా వెళ్ళాలి. పెద్దపెద్దవాళ్ళు వస్తారు. మన రచయితలు కూడా చాలామంది వస్తారు. మినిస్టర్లు, సెక్రటరీలు, పరిచయాలు పెంచుకోవడానికి ఇట్లాంటి చోట్లకు వెళ్ళకతప్పదు!” అని రెండు క్షణాలాగి, “యూనో. ఒక ఫన్నీ విషయం చెబుతాను. ఈ ‘రెక్వియమ్’ అనే మాటకు బ్రౌన్ తన నిఘంటువులో ఏం అర్థం రాశాడో తెలుసా. పీనుగులను తీసుకు వెళ్ళేటప్పుడు పాడే విషాద సంగీతం. హౌ ఈజ్ యిట్!” అని పెద్దగా నవ్వుతూ – మాలతికి విసుగ్గా ఉంది. యదువంశి చూపే ఈ అనవసర ప్రేమ భరించలేనట్లుగా – పదకొండు దాటినా ప్రొఫెసరు యదువంశి రాలేదు. కారిడార్లో నిలబడి, విసుగ్గా అటూ ఇటూ చూస్తూ మాలతి.

రోడ్ల నుంచి, చుట్టూ ఉన్న పొదల మధ్య నుంచి మొలుచుకొస్తున్నారు స్టూడెంట్లు. యూనివర్శిటీలు, క్లాసులు, తెలుగు పాఠాలు – ఇదంతా శిక్ష కాకపోతే ఏమిటి అన్నట్లుగా ఉన్నాయి వాళ్ళ ముఖాలు. కవిత్వం ఎందుకు రాస్తారు? కథలెందుకు చదువుతారు? ఇదంతా మనల్ని మనం శిక్షించుకొనే ఒక ప్రయత్నం కాదా అనేది వాళ్ళ నమ్మకం. మాలతి అనే ఒక అమ్మాయి లెక్చరర్‌గా కొత్తగా వాళ్ళ మధ్యకు రావటం పెద్దగా ఆసక్తి కలిగించదు.

అంతకుముందు అక్కడ పనిచేసే సుందరం అనే లెక్చరర్ ఉరి పోసుకొని చనిపోయిన ఉదంతం కూడా పెద్దగా వాళ్ళను కదిలించలేకపోయింది. మాలతి సుందరం కోసం ఒక సంతాప సభను పెట్టుకొందాం అని అడిగినప్పుడు - వాళ్ళలో ఒక అనీజీ, అయిష్టం, చాలాసేపు గుసగుసలు -

"దళిత్ రైటర్స్ అందరూ ప్రెస్‌క్లబ్‌లో ఏదో మీటింగ్ పెట్టుకొన్నట్టున్నారుగా"

"ఇంతకీ సూసైడేనా?"

"అతని లవర్.... ఉష్!"

"పొయిట్రీ రాస్తాడట. అంతగా అర్థం కాదుకానీ..."

"ఎన్ని మరణాలని! ఎన్ని సంతాపాలకని..."

ఆ చివరి మాటలు ఫెడేల్మని తగిలాయి మాలతికి.... ఆ రెండు మాటలు రెండు శాపాల్లా -

"మార్నింగ్ మేడమ్!"

"మార్నింగ్ ! మార్నింగ్!"

"వెయిటింగ్ ఫర్ సమ్‌బడీ!" నవ్వింది మాలతి.

"వెయిటింగ్ ఫర్ గోడో...." అందో అమ్మాయి.

"నో నో, వెయిటింగ్ ఫర్ రెక్వియమ్, శవయాత్ర కోసం" అంది మాలతి.

అర్థంకాని ముఖాలతో లెక్చర్‌హాల్ వైపు వెళ్ళారు వాళ్ళు. ఆ లెక్చర్ హాలు భయంకరమైన మెటాఫర్‌లా భయపెడుతుంది మాలతిని. మొదటి అంతస్తులో ఉందా హాలు. దాని పక్కనే ఉన్న పారాపెట్ గోడ కూలి - శూన్యంలోకి తెరవబడ్డ ద్వారంలాగా, రెండేళ్ళుగా దాన్ని బాగు చేయించినవాళ్ళు లేరు. దాన్ని 'సూసైడ్ పాయింట్' అనీ 'సంతాపద్వారం' అనీ జోక్ చేస్తుంటారు పిల్లలు. మధ్యలో ఒకసారి దాన్ని సగంవరకూ కట్టి వదిలేశారు. ప్రస్తుతం విరిగిన బల్లలు, కుర్చీలు దానికి అడ్డంగా పెట్టి -

మాలతి చేరిన కొత్తలో పడిపోయిన గోడను కట్టే కార్యక్రమం మొదలైంది. "పాతికవేలు శాంక్షన్ అయ్యింది! గోడ ఎంతవరకు వస్తే అంతవరకే" అంటూ మొదలుపెట్టారు. మొగుడూ, పెళ్ళాం ఇద్దరే కూలీలు. ఆడమనిషి నిండు చూలాలు. మొత్తం ప్రపంచాన్ని కట్టగలమన్న ఆత్మ విశ్వాసంతో ఉన్నారు వాళ్ళిద్దరు. బరువైన శరీరాన్ని మెల్లగా కదిలిస్తూ ఆమె ఇటుకల్ని మోస్తుంది. సంతాపద్వారం దగ్గర ఆమెను చూసినప్పుడల్లా మాలతిలో ఏదో గుబులు. ఒక అశుభసూచకంలా. ఆ ఇటుకల మధ్యనే ఆమె బిడ్డను కంటుం

దేమోనని మాలతి భయం. ఆమాటే మగమనిషితో అంది. "ఇంకా నెల టయం ఉందమ్మా" అనేవాడు.

ఆరోజు మాలతి కథాశిల్పంపై క్లాస్ చెబుతోంది. త్రిపుర కథల గురించి చెబుతూ - మాలతి నిలబడ్డ చోటు నుంచి సంతాపద్వారం కనిపిస్తుంది. సగం కట్టిన గోడకు ఆనుకొని ఆడమనిషి నీరసంగా కూర్చొని ఉంది. నొప్పులు రావటంలేదు కదా అని కంగారుపడింది మాలతి. 'చీకటి గదులు' అనే త్రిపుర కథను వివరిస్తోంది మాలతి. కళ్యాణి, శేషు, 'మిస్ట్'లాగా కమ్మేయటం, కథల్లోని మూడ్, వాతావరణం వివరిస్తోంది మాలతి. ఆ ఆడమనిషి మెల్లగా కదిలి, మెట్లు దిగి, బిల్డింగ్ దాటి, దూరం ఉన్న పొదలవైపు, ఒక ఎత్తైన రాగిచెట్టు వైపు నడిచింది.

సంతాపద్వారం ఫోటోఫ్రేమ్‌లా, ఆమధ్యన ఆడమనిషి స్పష్టంగా కనిపిస్తున్నారు మాలతికి. చెట్టు కానుకొని పొదల మధ్యన కూలబడి చాలాసేపు ఏమీ కనబడలేదు మాలతికి. క్లాసు అయిపోయినాక బయటకు వచ్చి ఆమె కోసం చూసింది మాలతి. చెట్టుకిందే ఉంది. రెండు చేతుల్తో నేలను తవ్వుతోంది. భయం, సన్నటి గుబులు రేగాయి మాలతిలో. కోమలి అనే మరో అమ్మాయిని వెంట తీసుకొని పొదలవైపు వెళ్ళింది మాలతి. గోతిలో ఎర్రటి ముద్దలాంటి శిశువు కనబడి, భయంతో పెద్దగా కేకవేసింది మాలతి. "బిడ్డ సచ్చిపోయిం దమ్మా!" అంటూ తాపీగా చెప్పింది.

ఆపాటికే, గోతినిండా మట్టిపోసి, చదును చేసి, ప్రేమగా ఆ ప్రదేశాన్ని రెండుసార్లు తడుముకొని - మాలతి ఆటోని పిలిపించి, ఇద్దరు కుర్రాళ్ళను తోడిచ్చి - 'పైసలేయి తల్లా' అంటూ ప్రతిఘటిస్తూనే ఉంది. ఆమెను హాస్పిటల్‌కు పంపినాక కూడా చాలాసేపు ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్ళాలనిపించలేదు మాలతికి. పూడ్చిపెట్టిన గోతిని ఒకసారి ముట్టుకోవాలనిపించింది. గోతిని తవ్వి, లోపలి శిశువు శవాన్ని బయటకు తీసి, అందరికీ చూపి - మనకు వ్యతిరేకంగా నిలిచిన సాక్ష్యం అంటూ అందరికీ చూపాలని, చెట్టుపైని ఆకులు టపటప మంటూ, ఎలిజీలాంటి పాటలాంటి చప్పుడు చేస్తూ, ఆమె తన శరీరంలోకి చెయ్యి దూర్చి బలవంతంగా మృతశిశువును లాగి - ఆ దృశ్యం ఊహించుకొని ఒక్కసారిగా ఉలిక్కిపడింది మాలతి.

తెల్లటి మారుతీ జెన్‌తో సహా ప్రత్యక్షమయ్యాడు యదువంశి. అప్పటికి పన్నెండు అయింది.

"ఈ రామం గొప్ప ప్రయోక్త" కారు బయలుదేరుతూనే కబుర్లు మొదలుపెట్టాడు యదువంశి.

“కన్యాశుల్కం నాటకాన్ని కుదించి స్టేజీకి అనుకూలంగా మార్చి పాతికేళ్ళనాడే దేశమంతా టూర్ చేశాడు. నంది అవార్డ్స్ కమిటీలో ఛైర్మన్‌గా ఉన్నాడు. సినిమాల్లో కూడా కొన్నాళ్ళు ఉన్నాడు. దేనికదే చెప్పుకోవాలి. గొప్ప నటుడు. షేక్స్‌పియర్ పాత్రలు ఈయన స్పెషాలిటీ. మాక్‌బత్‌లా స్టేజీపైకి వస్తే స్పెల్‌బౌండ్. ముఖ్యంగా చివరి సీన్లు.

“పిల్లలిద్దరూ అమెరికాలో సెటిల్ అయ్యారు. నాటకాల్లో బాగా రాణిస్తున్న ఒక పేద కుర్రాణ్ణి తెచ్చుకొని ఇంట్లోనే ఉంచుకొన్నాడు!”

వార్తలు చదివినట్లుగా కబుర్లు చెబుతున్నాడు యదువంశి. అసహనంగా, మౌనంగా కూర్చుంది మాలతి. కారు కాంపస్ దాటుతుండగా రోడ్డుకు అడ్డంగా నిలబడి కారు ఆపారు ఒక యాభైమంది విద్యార్థులు. గత పదిరోజులుగా యూనివర్శిటీ అంతా పోస్టర్లు, కరపత్రాలు - పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమం.

ప్రభుత్వానికి నిరసన తెలియజేసే ఒక కార్యక్రమం. అణిచివేత, పోలీసుల హింస - రచయితలతో, మేధావులతో సంతకాలు సేకరించి ప్రభుత్వానికి పంపాలని -

యదువంశి ముందు కాగితాలు, కలం. “దిస్ ఈజ్ టూమచ్! నన్ను మీరు ఫోర్సు చెయ్యలేరు. మనం పాలిటీషన్లలాగా రోడ్ల కెక్కటం నాకు నచ్చదు. నా నమ్మకాలు నాకున్నాయి! ఈ కాగితాలపై నేను సంతకాలు పెట్టను. ఈ మాస్ హిస్టీరియా లాంటి చేష్టలు నాకు నచ్చవు!” అంటూ కాగితాన్ని బయటకు విసిరాడు. వాళ్ళలోంచి ఒక కుర్రాడు యదువంశి చొక్కా పట్టుకొని - మిగిలిన కుర్రవాళ్ళు అతన్ని వెనక్కు లాగి - “మీరు వెళ్ళండి సార్” అంటూ కారుకు దోవ యిచ్చారు.

ముఖం అంతా ఎర్రగా కందిపోయి “బ్లడీ రోగ్స్! బ్లడీ రోగ్స్” అనుకొంటూ చాలాసార్లు తిట్టుకొన్నాడు యదువంశి. చాలాసేపు మాటలు రానివాడిలా మారిపోయాడు. శ్వాస భారమై “కాసేపు కారును పక్కన ఎక్కడన్నా ఆపుతాను!” అంటూ కారును రోడ్డు పక్క మార్జిన్‌లో ఆపాడు. “ఏమైంది?” అంటూ కంగారుగా అడిగింది మాలతి. యదువంశి ముఖం ఎర్రగా ఉబ్బినట్లయి శరీరమంతా చెమటలు పట్టి - వేటకుక్కలేవో తరుముతున్నట్లుగా జీవంలేని నవ్వు ఒకటి నవ్వి - “ఏంగ్జైటీ న్యూరోసిస్ - ఇదివరకు రాత్రులే వచ్చేది. ఇప్పుడు పగలు కూడా. ఇట్లా గుంపుల్ని, మాబ్‌ను చూసినప్పుడు - లేదా ఏదైనా వయొలెన్స్ చూసినపుడు - మనసు వశం తప్పుతుంది. కంట్రోలు చేసుకోవటం చాలా కష్టం అవుతుంది. ‘కోమలి’కి కొంచెం అలవాటయింది.

వెంటనే కర్టెన్లు మూసివేసి, లైట్లు తీసివేసి - నన్ను దగ్గరగా లాక్కొని - ఈ అటాక్ ఒక్కోసారి పావుగంట లేదా అర్ధగంట, తీవ్రంగా ఉంటే ఐదారుగంటలు - ఎంత నరకమో - 'బ్రెయిన్‌లో స్టెన్‌గన్స్' అంటాడే ఆరుద్ర అట్లా" యదువంశి మాట్లాడటం ఆపి తల బరువుగా నొక్కుకొంటూ, నాపై సానుభూతి కలగటం లేదా అన్న చూపుతో మాలతిని చూశాడు.

మాలతికి ఇదంతా విసుగ్గా, పట్టించుకొనే అవసరంలేని తమాషాలా తోచి "మీరు టాబ్లెట్ వేసుకొని, కాసేపు రిలాక్స్ అవండి. నేనట్లా ఒక పది నిముషాలు రోడ్డు ఆ మూలదాకా వెళ్ళొస్తాను" అంటూ కారు దిగింది. గాయం ఇంకాస్త లోతైనట్లుగా, బాధ పెరిగినట్లుగా ముఖం పెట్టాడు యదువంశి.

గాయపడ్డ జంతువులా యదువంశి కారు లోపల మెలికలు తిరిగి పోతున్నాడు. గుండెలలో ఏదో బరువు. అరణ్యాలో, సముద్రాలో, పెను మంటలో అతన్ని చుట్టుముట్టడానికి పరుగులు తీస్తున్నట్లుగా -

యదువంశికి కవిగా మంచి పేరుంది. మొదటి కవితాసంపుటి వేసే సమయానికి యూనివర్శిటీలో లెక్చరర్‌గా ఉంటున్నాడు. పబ్లిషరే దొరకని ఆ పుస్తకాన్ని ప్రభావతి దగ్గరుండి ప్రింట్ చేయించింది. అప్పటికి వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోలేదు. యదువంశి గురించి అప్పటికే పుకార్లు ఉన్నాయి. ఆ పుస్తకం ఆవిష్కరణ, పెళ్ళి ఒక వేదికపైనే జరిగాయి. 'ఆ పెళ్ళి ఒక పీడకల' అంటుండేవాడు యదువంశి. ప్రభావతి తల్లి పెళ్ళిలో చాలా గొడవ చేసింది. 'కసాయి వెధవ పిల్లని చంపేస్తాడం'టూ. 'చిరుత, తోడేలు కలిపి పుట్టిన ఆడది' అంటూ ఆమెపై మండిపడ్డాడు యదువంశి. కవులందరి ముందు తనకు అవమానం జరిగిందని విలపించాడు. యదువంశి స్నేహాలు పెళ్ళితో ఆగి పోలేదు. చాలాసార్లు ప్రభావతి దృష్టికి కూడా వచ్చాయి. ఇద్దరికీ గొడవలయ్యేవి. విసిగిపోయి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ చేయించుకొంది ప్రభావతి. 'బిగుసుకు పోయిన మంచుగడ్డ అది!' అని ప్రభావతి గురించి అన్నిచోట్లా చెప్పేవాడు. 'ఫ్రిజిడిటీ, అనుమానం, మొండితనం అన్నీ కలిస్తే ఆవిడ!' అని ప్రచారం చేసేవాడు. రెండేళ్ళ తరువాత చాలామంది మగవాళ్ళతో లైంగిక సంబంధాలున్నాయంటూ ఎడల్టరీ కారణంగా విడాకులు ఇవ్వమని కోర్టుకు వెళ్ళాడు.

నోటీసులు పంపిన తరువాత, ఒక వారానికి ప్రభావతి - హైదరాబాద్ వచ్చింది. పగలంతా హోటల్‌లో ఉండి, రాత్రి పదకొండుకు యదువంశి అపార్ట్ మెంట్‌కు వెళ్ళింది. "ఒక్కదానివే వచ్చావా?" అని వ్యంగ్యంగా నవ్వగలిగిన యదువంశి ఆమె శరీరంపై నుంచి వస్తున్న వాసనలను గమనించలేదు.

హఠాత్తుగా తలుపు గడిపెట్టి, పర్సులోంచి అగ్గిపెట్టె తీసుకొన్నాక గానీ యదువంశి కి విషయం అర్థం కాలేదు. పెనుమంటలా భగ్గుమంది ప్రభావతి. బాధ, దుఃఖం, కోపం - ఏ భావమూ లేకుండా నిర్మలంగా ఉందామె ముఖం. గది నిండా మంటలు, పొగలు. భయంతో బిగుసుకుపోయాడు యదువంశి. తలుపులు పగల గొట్టుకొని, మనుషులు లోపలకు వచ్చేవరకు సజీవంగా తగలబడటం - అనే కార్యక్రమాన్ని అతను చూస్తూనే ఉన్నాడు.

ఇప్పుడు హఠాత్తుగా అతని శరీరంలోంచి మంటలు లేస్తాయి. నల్లని భీకరమైన పొగలు అతని చుట్టూ గిరగిరా తిరుగుతూ - మనిషి కాలుతున్న ఒక విధమైన కమురు వాసన, అతని చర్మగ్రంథుల నుంచి ఒక్కసారిగా గుప్పు మంటుంది.

కోమలి అనే రీసెర్చి స్టూడెంటును రెండో పెళ్ళి చేసుకొన్నాడు ఆ తరువాత నాలుగేళ్ళకు. 'తెలుగు కవిత్వం - మార్మిక సౌందర్యం' అనే అంశం మీద ఆమె చేసిన పి.హెచ్.డికి యదువంశి గైడ్. యదువంశి మహాకవి అని ఆమె గాఢ విశ్వాసం. 'కోమలి తనకు దొరికిన కొత్త ఆశ'గా అందరికీ చెప్పు కొంటాడు యదువంశి..

ఈ పెళ్ళి కూడా ఒక తమాషాగా జరిగింది. ఇన్విటేషన్లు అన్నీ పంచినాక, ఒక రాత్రి నాన్ కింగ్‌లో డిన్నరు చేసి వస్తుండగా, దారిలో యదువంశికి అటాక్ వచ్చింది. శరీరమంతా నిలువెత్తు మంటలా మారిపోయినట్లు భయంతో బిగుసుకుపోయి - యదువంశి పెద్దగా కేకలు వేశాడు. శరీరమంతా వంగిపోయి, నేలపై కూలబడి, ముఖాన్ని చేతుల్లో దాచుకొని పెద్దగా ఏడవటం మొదలు పెట్టాడు. కోమలికిదో షాక్. పదిరోజుల పాటు యదువంశి కనబడలేదు.

ఆ తరువాత ఆరు నెలలకు వాళ్ళ పెళ్ళి జరిగింది. వెన్నెల రాత్రులు, కవిత్వం - చాలా సుఖంగా గడిచిపోయింది ఒక నెల పాటు. ఒక రాత్రి మళ్ళీ పెనుమంట యదువంశిని చుట్టుముట్టింది. ఈసారి భయంతో పెద్దగా కేకలు వేయటం మొదలుపెట్టాడు. "బ్లడీ బిచ్" అంటూ కోమలి గొంతు పట్టుకొన్నాడు. "మీ ఆడవాళ్ళందరూ మురికి కూపాలు" అంటూ పెద్దగా అరిచాడు. "మీకు సెక్స్ కావాలి. డబ్బు కావాలి. గ్లోరీ కావాలి. ప్రేమిస్తున్నామంటూ నయాన పలికి మాపైన విషంగక్కే జంతువులు" అని అరవసాగాడు. భయంతో వణికి పోయింది కోమలి.

ఈ భయం గొలిపే సమయాలతో సహా అతనితో కలిసి ఉండటమా, లేదా విడిపోవడమా - అనే రెండు దారుల మధ్య ఎందుకో మొదటిదానికే రాజీపడిపోయింది కోమలి.

కారులో కూర్చున్న యదువంశికి రోడ్డుపై అల్లంత దూరంలో ఒంటరిగా నిలబడ్డ మాలతి కనిపించి, ఆవిడపై గొప్ప విసుగు, కోపం కలిగాయి. తన దగ్గర కూర్చుని, ఓదార్చి ఉపశమనాన్ని ఇచ్చి - "వట్టి కృతఘ్నురాలు" అని కోపంగా గొణుక్కున్నాడు. బ్రీఫ్‌కేసు నుంచి రెండు మాత్రలు తీసి, వేసుకొని మౌనంగా కళ్ళు మూసుకొని పడుకొన్నాడు.

రోడ్డుపై నిలబడ్డ మాలతికి ఈ మొత్తం ప్రయాణమంతా విసుగు కలిగించే ఉదంతంలా తోచింది. ఎవడో తెలియని వ్యక్తి చావుకు వెళ్ళటానికి బయల్దేరటమూ, అదీ యదువంశితో. మధ్యలో ఇట్లా ఆగి - ఎంత ప్రయత్నించినా అతనిపై సానుభూతి కలగటంలేదు. అతన్ని గురించి కథలు కథలు చెబుతుంటారు కాంపస్‌లో. యూనివర్శిటీలో ఉద్యోగం రావడానికి అతనెంతో సాయం చేశాడు. అదొక్కటే అతనిపైనున్న సాఫ్ట్ కార్నర్. వెనక్కు వెళ్ళిపోవాలని కోరిక బలంగా ఆమెలో కలిగింది.

సికింద్రాబాద్ వైపు నుంచి హఠాత్తుగా చొరబడినట్లుగా రోడ్డుపైకి కుర్ర వాళ్ళ గుంపు ప్రవేశించింది. పాతికమందో, ముప్పయిమందో ఉంటారు.

"నాకో కల వచ్చింది! కలంతా నలుపు రంగులో ఉంది. దాన్ని ఎట్లా వివరించటం" అంటూ స్లోగన్ రాసిన బానర్ పట్టుకొని ఒక అమ్మాయి ముందు నడుస్తోంది. బహుశా ఆ గ్రూపుకి ఆ అమ్మాయి లీడర్‌లా ఉంది. 'గబ్బిలాల సేన' అని బ్యానర్ పట్టుకొని ఇంకో కుర్రాడు కనిపించాడు. 'గబ్బిలాల నుంచి నేర్చుకోవలసిన రహస్యాలు' అంటూ ఇంకో బోర్డు. గమ్మత్తుగా అనిపించింది మాలతికి.

చూస్తుండగానే గుంపులోంచి నలుగురు అమ్మాయిలు బయటకు వచ్చి కళ్ళకు నల్లటి గుడ్డలు కట్టుకొని రోడ్డుపై నిర్భయంగా నడవటం మొదలు పెట్టారు.

"మాకు ఫోటో నెగిటివ్‌లంటే యిష్టం. అన్ని రంగులకు మేం వ్యతిరేకం. నల్లటి ఆకాశం, నల్లటి పక్షులు, నల్లటి బురఖా, నల్లని శ్రీకృష్ణుడు మాకిష్టం. నలుపు మా ఆదర్శం. తెల్లని మంచు, వెన్నెల ఆకాశం, శ్వేతవర్ణపు పక్షులు - వద్దు, వద్దు" అంటూ వెనక నుండి మైకులో వినిపిస్తుంది.

మాలతి ఆశ్చర్యానికి అంతులేదు. అంతలోనే ఒక అమ్మాయి మాలతి చెయ్యి పట్టుకొని, రోడ్డు మధ్యకు లాగింది. "రండి మేడమ్. మీకు గబ్బిలాల రహస్యాలు చెబుతాం. భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయి" అంటూ ఆ అమ్మాయి మాలతి కళ్ళకు నల్లటి గుడ్డ కట్టింది.

"మీ కంటిపాపలు విశాలం అవుతున్నాయి. చూపులు స్థిరపడు తున్నాయి - మీ కనుగుడ్డు చుట్టూ ప్రపంచం తేలాడుతుంది. నడవండి గంభీ రంగా - ధైర్యంగా కదలండి. మీరు చూడగలుగుతున్నారు. నల్లటి మేఘాల లోంచి ఫిల్టర్ అవుతున్నట్లుగా ప్రపంచం మీకు అవగతమవుతుంది."

మాలతి ఒక హిప్నాటిక్ ట్రాన్స్‌లోకి నడిపించబడింది. ధైర్యంగా నడు స్తుంది. ముందు వస్తున్నది మనిషా, రిక్షానా, కారా అని పోలిక పట్టగలుగు తుంది. మాలతి అట్లా కళ్ళకు గంతలు కట్టుకొని నడుస్తుంటే "వెలుగును జయించిన మహిళ. హిప్ హిప్ హుర్రే" అంటూ కేకలు వేశారు.

కళ్ళగంతలు విప్పి, "ఏమిటిదంతా?" అని వాళ్ళను అడిగింది. "విద్యుత్ ఛార్జీలు పెంచటంపై ఇది నిరసన కాదు. బహుశా ఇంకో రెండు మూడేళ్ళలోనే కరెంటు డబ్బున్నవాళ్ళకే పరిమితమయ్యే లగ్జరీ అవుతుంది. చీకట్లో బ్రతకడానికి సామాన్యుల్ని సిద్ధం చేస్తున్నాం."

చాలా సీరియస్‌గా చెప్పిందా అమ్మాయి. ఆ అమ్మాయి పేరు గబ్బి లాల లలిత. వాళ్ళ ఉద్యమానికి మద్దతుగా ఒక వెయ్యి రూపాయలు, అప్పటి కప్పుడు ఆశువుగా రాసిన కవిత 'గబ్బిలాల కోసం' వాళ్ళకు అందించింది మాలతి.

"చీకటి రాజ్యపు తొలి కవయిత్రికి హిప్ హిప్ హుర్రే!" అంటూ పెద్దగా కేకలు వేశారు కుర్రవాళ్ళు. గబ్బిలాల సేన రోడ్డును దాటుతుండగా యదువంశి కారులోంచి హారన్ మోగించాడు. అతని ముఖంలో కాస్త రిలీఫ్ తోస్తోంది. మాలతి ముఖంలో ఇందాకటి విసుగులేదు. కాకుంటే 'అజ్ఞాత శవం, తన రాకను గుర్తుపట్టి ఓదార్పు పొందుతుందా? ఉహు, ఇదంతా ఓ తమాషా' అని మనసులో అనుకొంది.

"ఈ చనిపోయిన మనిషి, ఈ పి.సి. రామ్, ఇతనికిపుడు రెండు అంత్య క్రియలు జరుగబోతున్నాయి" యదువంశి మళ్ళీ తన మాట్లాడే కార్యక్రమం మొదలుపెట్టాడు. "అమెరికాలో సెటిల్ అయిన పిల్లలు, భార్య కలిసి ఒకచోట, అతను నాలుగేళ్ళ క్రితం దత్తత తీసుకొన్న కుర్రాడు, అతనొకచోట - శవాన్ని రెండుగా చీల్చటం కుదరదు గానీ, కుదిరితే బహుశా మనం అక్కడకు వెళ్ళగానే, మనం అటో ఇటో ఏ అంత్యక్రియలకు వెళ్ళాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. మనం దూరంగా నిలబడి వాచ్ చేద్దాం. వి.సి, రిజిస్ట్రారులు ఎటు వెళితే అటుపోదాం! చనిపోయిన రామ్ మనల్నేం అడగబోడు కదా. అన్నట్టు ఈ చనిపోయిన పి.సి. రామ్ నీకు గొప్ప అభిమాని. చనిపోబోయే ముందు రామ్ నీ కవితలు 'మధ్యాహ్న సమయం', 'ఆమె ఎవరైతేనేం' కవితల్ని దగ్గర

పెట్టుకొన్నాడట. చాన్నాళ్ళు నిన్ను వాళ్ళ యింటికి తీసుకురమ్మని అడిగేవాడు. కానీ, ఇప్పుడు ఇలా అంత్యక్రియలకే నిన్ను తీసుకురాగలిగాను" అలుపు లేకుండా మాట్లాడి కాస్త ఆగి, మళ్ళీ మొదలుపెట్టాడు యదువంశి.

"ఈ ఉదయం ఇంకో గమ్మత్తయిన సంఘటన జరిగింది. చానా యేళ్ళ క్రితం రామ్ నాకో బ్రీఫ్‌కేస్ ఇచ్చాడు. జాగ్రత్తగా దాచి ఉంచమని. ఆ బ్రీఫ్‌కేస్ కోసమని, పొద్దున్నే అమెరికా కొడుకు, ఇటు ఇండియా దత్తత కొడుకు ఇద్దరూ ఫోన్ చేశారు. అందులో బంగారమో, నగలో, డాక్యుమెంట్లో ఉండి ఉంటాయని వాళ్ళ నమ్మకం. నేను సస్పెన్సు విప్పలేదు. లాయర్ల ముందే బ్రీఫ్‌కేస్ తెరుస్తానని చెప్పాను. నిజానికి ఆ బ్రీఫ్‌కేసులో ఉన్నది యాభై యేళ్ళనాటి మట్టి గ్రామఫోన్ రికార్డులు. యాభైలలో అతను నటించిన ఏకైక అరవ సినిమాలోని పాటలవి. ఆ అరవ సినిమాలో అతన్తోపాటు నటించిన అమ్మాయి - ఆ పిల్లంటే ఎంతో యిష్టం అతనికి. ఆ మట్టి రికార్డు, ఆ పాట, ఆ పది నిముషాల సన్నివేశం, ఆ అరవ పిల్ల, అతనికి మిగిలిన మధురమైన జ్ఞాపకాలు. ఈ నాస్టాలిజయాలు, సెంటిమెంట్లు ఆ పిల్లలకు చెప్పినా అర్థం కావు."

కారు, చాలా నెమ్మదిగా వెళుతోంది. రోడ్డు చాలా ఇరుగ్గా ఉంది. ముందెక్కడో ట్రాఫిక్ జామ్ అయినట్లుగా ఉంది. నెమ్మదిగా, బరువుగా కదులుతున్నాయి వాహనాలు. కారు చనిపోయిన మనిషి యింటికి దగ్గరవుతున్న కొద్దీ మాలతిలో ఎందుకో ఒక దిగులులాంటి భావన, బరువుగా తోచటం మొదలైంది. సంతాపద్వారం, ఒంటరి రాగిచెట్టు, పూడ్చబడ్డ శిశువు శవం గుర్తు కొచ్చాయి. ఈ మరణమనే భావనను తప్పించుకొని ఎటైనా పారిపోవాలని బలంగా అనిపించసాగింది.

విశాలమైన బంగళా. సంతాపాన్ని సూచించే దృశ్యాలేమీ లేవుగానీ - షామియానా, కుర్చీలు, దండలు కప్పిన శవం - చిరపరిచితమైన ప్రతీకలు. వచ్చినవాళ్ళు గుంపులు గుంపులుగా చీలి కబుర్లు చెప్పుకోవటం - పొర్లిపొర్లి ఏడవటాలు, శోకండాలు మొదలైనవి లేకపోవటం స్పష్టంగా తెలుస్తోంది. చావు వీళ్ళని స్పృశించి, బాధించే శక్తిని కోల్పోయిందా అని ఆశ్చర్యపోయింది మాలతి. శవం దగ్గరగా వెళ్ళింది. ఎందుకో ఆ శవాన్ని ముట్టుకోవాలనిపించింది. అతని మట్టి రికార్డుల ఉదంతం గుర్తుకొచ్చింది. నలభైయేళ్ళపాటు ఒక స్నేహాన్ని, ప్రేమని అపురూపంగా దాచుకోగలిగిన మనిషిని, మళ్ళీ ఇక చూడలేం కదా అని దిగులు వేసింది. ముఖంపైని దండలు పక్కకు సర్ది, నిర్మలంగా ఉన్న బుద్ధుడిలా - చనిపోయిన మనిషి నుదిటిని చేతితో తాకి దూరంగా జరిగింది మాలతి.

గేటు దగ్గర గొడవ గొడవగా ఉంది. దత్తత కొడుకు (చరణ్) మరో ఇరవైమంది కుర్రాళ్ళు - బయట పెద్దగా కేకలు వేస్తున్నారు. రోడ్డుకు ఎదురుగా మరో షామియానా వేసి, పి.సి. రామ్ ఫోటోను మధ్యలో పెట్టి దండలు వేసి - మైకులోంచి భగవద్గీత, ఖురాను, బైబిలు పఠనాలు వినిపిస్తున్నాయి.

నల్లటి మారుతీవ్యాన్‌పై పి.సి. రామ్ శవాన్ని పెట్టి రకరకాలుగా అలంకరణలు చేయటం మొదలుపెట్టారు. వాన్ ముందు మ్యూజిక్ పార్టీ ఉండాలా వద్దా అనే చర్చ చాలాసేపు సాగింది. "వద్దు. మౌనంగా నడిచి వెళ్దాం" అంటూ యదువంశి సలహా యిచ్చాడు. రోడ్డుపైన పొడవాటి శవయాత్ర. మౌనంగా నడిచి వెళ్ళాలన్న యదువంశి ప్రతిపాదనని ఎవరూ పట్టించుకోలేదు. "నాటక ప్రయోక్త పి.సి. రామ్ అమర్‌హై!" "థియేటర్‌బ్రహ్మ రామ్ జోహార్!" అంటూ నినాదాలు రోడ్డు పొడవునా మారుమోగాయి. ఈ నినాదాలు కాకుండా కారు ముందూ, వెనుకా నడిచేవాళ్ళ కబుర్లు - మౌనంగా, చప్పుడు లేకుండా ఉంటే ఎంత బాగుండును అనుకొంది మాలతి. తన చెవిలో ఏదో గుసగుసలాడుతున్న యదువంశిని తప్పించుకొని, శవం ముందుకు వెళ్ళింది మాలతి. చీరను భుజం చుట్టూ నిండుగా కప్పుకొని, తలవంచి, మౌనంగా నడుస్తోంది మాలతి.

శవయాత్ర ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చినాక పోలీసులు గుంపుగా వచ్చి ఊరేగింపును ఆపారు. ముందుకు వెళ్ళడానికి వీలులేదని, అక్కడ లక్షలాదిగా జనం, పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, ధర్నాలు, నినాదాలు, పోలీసు బలగాలు - శవాన్ని మెయిన్ రోడ్డు నుంచి కాకుండా సందులలో తీసుకెళ్ళమని సలహా యిచ్చారు.

సరిగ్గా అప్పుడే వర్షం మొదలైంది. గొడుగులతో సిద్ధంగా లేరు వాళ్ళు. విసుక్కొంటూ, తిట్టుకొంటూ - చాలామంది వెనక వస్తున్న కార్లలోకి దూరిపొయ్యారు. ఒక పదిమంది మాత్రం శవం ముందు మిగిలారు. యదువంశి జాడలేదు. మాలతి మాత్రం, శవం ముందే నడుస్తోంది. వానకు శరీరమంతా తడిచి - ఎవరో కుర్రవాడు వాన్ పైకి ఎక్కి శవానికి గొడుగు పట్టాడు. దూరం నుంచి ఆ దృశ్యం ఆబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌లా ఉంది. వాన చప్పుడు తప్ప మరే శబ్దమూ లేని ఆ ఊరేగింపులోకి, వినబడీ వినబడనట్లుగా, ఒక అలజడి, తీవ్రస్వరంతో ఘోషిస్తున్న మనుషుల గొంతుకలు - క్రమక్రమంగా శబ్దాలు దగ్గరవటం కూడా మాలతికి తెలుస్తోంది. వర్షం క్రమంగా పెద్దదవుతోంది. యదువంశి కారులోంచి కేకవేస్తున్నాడు లోపలికి రమ్మని - శవాన్ని ఒంటరిగా రోడ్డుపై వదిలేయటం మాలతికి ఇష్టంగా లేదు. రాజ్‌భవన్ దాటి, లక్డీకాపూల్

వరకు వచ్చినాక, పోలీసులు మరోసారి ఎదురయ్యారు. లోపలి సందులేవో చూపించి అటువైపు వెళ్ళమన్నారు. కేకలు, మనుషులు అటూ ఇటూ పరిగెట్టడాలు - దగ్గరవటం తెలుస్తోంది.

హఠాత్తుగా ఒక్కసారిగా ఢాంమంటూ శబ్దం. మళ్ళీ మళ్ళీ ఢాం! ఢాం! అంటూ తుపాకులు పేలుతున్న చప్పుళ్ళు - శవం ఆగింది. శవంతోపాటు వచ్చినవాళ్ళలో భయం, కంగారు. వాన్ వెనుకనున్న కార్లు ఒక్కొక్కటే వెనక్కు వెళ్ళిపోవటం కనిపిస్తోంది. మిగిలినవాళ్ళు కూడా గోడల చాటుకో, వరండాల కిందకో వెళుతున్నారు. చాలాసేపటికి శవం ముందు మాలతి ఒక్కతే తడుచు కొంటూ నిలబడింది. దూరం నుంచి పెనుకేకలు, చప్పుళ్ళు వినబడుతున్నాయి. మనుషులు తోసుకొంటూ, తొక్కుకొంటూ భయంతో పరిగెడుతున్న శబ్దాలు కూడా వినబడుతున్నాయి. మరోసారి తుపాకీ కాల్పుల శబ్దాలు వినబడ్డాయి. తూటాలు పక్కనుంచే దూసుకుపోతున్నట్లుగా, అట్లాగే కరకు బూట్ల చప్పుడూ - అన్నివైపుల నుంచీ ఒక యుద్ధం కమ్ముకొస్తున్నట్లుగా అనిపించింది మాలతికి. మాలతికెందుకో కదలాలనిపించలేదు. ఆ చనిపోయిన మనిషినట్లా వదిలేసి, ప్రాణభయంతో పరుగెత్తటం మాలతికి సాధ్యం కాలేదు. ధారలాగా కురుస్తున్న వానలో ఒంటరిగా, దిగులుగా, సంతాపసూచకమైన పతాకలాగా అట్లాగే నిలబడిపోయింది మాలతి.

*- చూపు, నవంబర్-డిసెంబర్ 2000*